ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 29 నవంబరు 2025





కాళంగి జలాశయం
మూడు గేట్ల ఎత్తివేత

కేవీబీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాళంగి జలాశయంలో నీటి మట్టం పెరగడంతో శుక్రవారం ఉదయం 18 గేట్లలో మూడింటిని రెండు అడుగుల చొప్పున పైకి లేపి నీటిని దిగువకు వదిలారు. ఈ సీజన్‌లో 217 అడుగులు మాత్రమే జలాశయంలో నీరు నిల్వ ఉంచాలనే అంచనాల ప్రకారం మిగతా నీటిని దిగువకు వదిలారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో వర్షాలు పడితే నీటి మట్టం పెరగవచ్చని, ముందస్తు చర్యల్లో భాగంగా గేట్లు ఎత్తి న్నట్లు ఏఈ నబియా తెలిపారు.

తీరం దిశగా కదులుతున్న దిత్వా

వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు

కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ముంచుకొస్తోంది. దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో శని, ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీతెలిపింది. శ్రీలంకను ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్‌గా ఏర్పడి తీరం వెంబడి 50 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే అవకాశంఉందని వాతావరణశాఖ చెబుతోంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాలతో పాటు కలెక్టరేట్‌లోను కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తుఫానుతో ఇబ్బంది కలిగినా.. ముంపునకు గురైనా ఎప్పటికప్పుడు సమాచారాన్ని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 0877-2236007లో సమాచారం ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు ఆదేశించారు. దిత్వా తుఫాను నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలతో కలెక్టర్ వెంకటేశ్వర్ టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. తీర.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే తాత్కాలిక పునరావాస కేంద్రాలను సిద్ధంచేసి, తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జలపాతాలు, వాగులు, నదీప్రాంతాలు, ప్రమాదకర పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్నిశాఖల సమన్వయంతో తుఫానుతీవ్రతను తగ్గించేలా.. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాగా, మూడు రోజుల పాటు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు ఆ శాఖ అధికారి రాజేష్ సూచించారు.



తూపిలిపాళెం తీరంలో ఎగిసి పడుతున్న కెరటాలు

తీరంలో ఎగిసిపడుతున్న కెరటాలు


వాకాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. ఈదురుగాలులు వీస్తూ కెరటాలు బలంగా తీరాన్ని తాకుతున్నాయి. దీంతో మత్స్యకారులు వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేట ఆగడంతో మత్స్యకారులకు జీవనోపాధి దెబ్బతింది. తీరప్రాంతాలలో వీస్తున్న చలిగాలులకు వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు.

వరి రైతుకు వెన్నుపోటు

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు



20 రోజులకే వెన్ను తీసిన వరిపైరు



రైతులు కొన్న విత్తనాల సంచులు

మిరప, వేరుశనగ, పత్తి రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారని వింటుంటాం. ఇప్పుడా పరిస్థితి వరి రైతులకీ దాపురించింది. సూళ్లూరుపేట మండలంలో బీపీటీ 2752 రకం విత్తనాలు కొని నార్లుపోసి వరి నాటుకున్న రైతులు దారుణంగా మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. విత్తనాలు అమ్మిన దుకాణాదారు, వ్యవసాయాధికారులు మాత్రం విచారిస్తాం, కంపెనీ వారిని రప్పిస్తాం, పరిహారం ఇప్పిస్తాం అని తాపీగా సమాధానాలు చెబుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సూళ్లూరుపేటలోని ఒక ప్రయివేటు దుకాణంలో బీపీటీ 2782 (జిలకర మసూరాలో ఒక రకం) విత్తనాలను సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రైతులు కొనుగోలు చేశారు. విత్తనాల సంచులపై అన్నపూర్ణ సీడ్స్, నంద్యాల అని ఉంది. ఇదేమి రకమని అడిగితే, కొత్త రకం విత్తనాలు మంచి పంట వస్తుందని దుకాణ యజమాని చెప్పారని రైతులు అంటున్నారు. ఈ విత్తనాలతో నాట్లు పోసుకున్నారు. నారు పచ్చగా చిక్కగా ఎదిగింది. 30 రోజుల నారుని పెరికి పొలాల్లో నాటుకున్నారు. 20 రోజులకే పైరు వెన్నుతీయడం మొదలైంది. సాధారణంగా 60 రోజులకు కానీ వెన్నురాదు. పైగా వెన్నులోనూ గింజల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ముందుగానే వెన్నుతీసిన పైరులో గింజ గట్టిపడదని, పంట రాదని అర్థమైన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణానికి పరుగులు తీశారు. 'ఎవరికి చెప్పొద్దు కంపెనీ వారితో మాట్లాడి ఎకరాకి రూ.2వేలు ఇప్పిస్తా' అని వారు సమాధానపరిచారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. 'పరిశీలిస్తాం.. న్యాయం చేస్తాం' అంటూ వారం రోజులు గడిపేశారని రైతులు చెబుతున్నారు. లక్షలు ఖర్చు చేసి చేసిన సేద్యం అప్పులు మిగిలించిందని ఆవేదన చెందుతున్నారు. సూళ్లూరుపేట మండలంలోని మన్నెముత్తేరి, గంపలకండ్రిగ, పెద్దఉల్లాపడవ, మంగళంపాడు ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. దాదాపు 80 మంది రైతులు 200 ఎకరాలకు పైగా ఈ నకిలీ విత్తనాలతో మోసపోయి తీవ్రంగా నష్టపోయారు. వానలు పడుతూ ఉండడంతో ఇంకా పలు గ్రామాల్లో వరినాట్లు జరుగుతున్నాయి. వీటిలో ఎందరు ఇలా మోసపోయారో తెలియాల్సివుంది.

నిండా మోసపోయా



నేను 10 ఎకరాలు వరిసాగు చేస్తున్నాను. బీపీటీ 2782 రకం విత్తనాలు కొనుగోలు చేసి నాటా. మొత్తం సాగుకు రూ.2 లక్షలు పెట్టుబడి ఖర్చు అయ్యింది. నాటిన 20 రోజులకే వెన్ను తీసేసింది. ఆ ఎన్నులో 10 నుంచి 15 గింజలు మాత్రమే ఉన్నాయి. పూర్తిగా నష్టపోయా.

- కొమ్మనగుంట శ్రీనివాసులు, మంగళంపాడు రైతు



వెన్నుతీసిన పైరును ఏవో కాంచనకు చూపిస్తున్న రైతులు

పరీక్షలు చేయిస్తాం

దుకాణ యజమాని ద్వారా కంపెనీ వారిని పిలిపించి పొలాలను పరిశీలించాం. వెన్నుతీసిన మాట వాస్తవమే. శాస్త్రవేత్తలను పిలిపించి పరీక్షలు చేయిస్తాం. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం.

- కాంచన, మండల వ్యవసాయ అధికారి

న్యాయం చేయండి



ఈ విత్తనాల కొనుగోలు చేసి 4 ఎకరాలు వరినాట్లు వేశా. 19 రోజులకే ఎన్ను తీయడంతో పోసపోయానని అర్థమైంది. ఇవి నకిలీ విత్తనాలని షాపు యజమాని వద్దకు వెళ్లాను. వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. న్యాయం చేయాలి.

- గంపల చలపతి, గంపలకండ్రిగ రైతు

స్పోర్ట్స్ విలేజ్

- దామినేడులో 28 ఎకరాల కేటాయింపు
- పలమనేరు ఏఎంసీకి 33 ఎకరాల వెటర్నరీ వర్సిటీ భూములు
- మంత్రిమండలిలో నిర్ణయాలు

తిరుపతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటు దిశగా కీలక అడుగు పడింది. తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద స్పోర్ట్స్ విలేజ్‌కు 28 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదముద్ర వేసింది. దామినేడులో 193-8, 193-9 తదితర సర్వే నంబర్లలోని 28.37 ఎకరాలను శాప్‌కు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకరించింది. ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా జాతీయ ప్రమాణాలతో క్రీడల అభివృద్ధికి మౌళిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ భూములకు ఎకరా రూ.2.50 కోట్లు చొప్పున కలెక్టర్ వెంకటేశ్వర్ మార్కెట్ విలువ సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వం ఉచితంగా భూములను క్రీడల కోసం కేటాయించింది. దీనిపై సీఎం చంద్రబాబుకు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ విలేజ్‌గా సీఎం నామకరణం చేశారని, క్రీడాంధ్రప్రదేశ్ రూపకల్పనలో ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయి కానుందని అభిప్రాయపడ్డారు.

● తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన 33 ఎకరాలను పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేసేందుకు కూడా మంత్రిమండలి అంగీకరించింది. వెటర్నరీ వర్సిటీ పరిధిలోని పలమనేరు లైవ్ స్టాక్ రీసెర్చి స్టేషన్ ఆధీనంలో ప్రస్తుతం ఆ భూములున్నాయి. ఆ భూములకు అవసరమైన పరిహారాన్ని కూడా పలమనేరు మార్కెట్ కమిటీ ఇప్పటికే చెల్లించింది. ఈ నేపథ్యంలో ఆ భూములను మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కేటాయిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.

యూడైస్ నమోదులో తప్పులు చేయొద్దు

- 6 వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షల రుసుం చెల్లింపు గడువు పెంపు

తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులకు సంబంధించిన ఫొటోలు, సంతకం, మోల్స్ తదితర వివరాలను యూడైస్‌లో నమోదు సమయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని డీఈవో కుమార్ శుక్రవారం సూచించారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనరును సంప్రదించాలన్నారు. ఇక, టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును డిసెంబరు 6వ తేది వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ నుంచి అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in ద్వారా మాత్రమే రుసుములు చెల్లించాలని ఆయన సూచించారు. అపరాధ రుసుములతో డిసెంబరు 15వరకు చెల్లించొచ్చన్నారు. ఆఖరి తేదీ వచ్చేవరకు చూడొద్దని సూచించారు.

కన్నీళ్లొస్తున్నాయ్..!

- ఇచ్చిన మాటకు కట్టుబడే ఉంటా
- నెల్లూరు జిల్లాలో గూడూరు విలీనంపై పోరాడతానన్న ఎమ్మెల్యే పాశం



'గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు నుంచీ ప్రజలకు మాటిచ్చా. దీనికోసం పోరాడుతూనే ఉన్నా. ప్రజల కోరిక నెరవేరకపోవడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేనందుకు కన్నీళ్లొస్తున్నాయ్. రాజకీయాలు శాశ్వతం కాదు. అవసరమైతే వదులుకునే పరిస్థితిలో ఉన్నా. టీడీపీ అధినాయకత్వాన్ని ఒప్పిస్తా. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు పోరాడుతూనే ఉంటా'నంటూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆవేదన చెందారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. 'గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని రెండు పర్యాయాలు అసెంబ్లీలో ప్రస్తావించా. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కూడా ఎన్నికలకు ముందు ఈ హామీ ఇచ్చారు. ఈ విషయంలో పరిస్థితులన్నీ అనుకూలంగా వచ్చి గూడూరు నియోజకవర్గ ప్రజలు సంబరాలు చేసుకునే సమయంలో ఏం జరిగిందో కానీ, చివరిక్షణంలో ఆగింది. కన్నీళ్లు ఆపుకోలేని పరిస్థితిలో ఉన్నా. గూడూరు నియోజకవర్గ ప్రజలకు జరిగిన అన్యాయంపై 20 మంది మంత్రులకు ఫ్యాక్స్ ద్వారా వివరించా. అందరూ సానుకూలంగా స్పందించారు. ఇక్కడి వాస్తవ పరిస్థితులను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు స్వయంగా వివరిస్తా. గూడూరును నెల్లూరులో కలిపేందుకు కృషిచేస్తా. దీనిని రాజకీయం చేయొద్దు. గూడూరును తిరుపతిలో కలిపిన పాపం ఏవరిదో ప్రజలకు తెలుసు. నాకు రాజకీయ భవిష్యత్తు ఉన్నా.. లేకున్నా గూడూరు కోసం పోరాడుతూనే ఉంటా' అని ఎమ్మెల్యే చెప్పారు.

- కోట, ఆంధ్రజ్యోతి

లోకేశ్ మామా.. మా కష్టం చూడండి

'లోకేశ్ మామా.. బడికి పోవాలంటే మా కష్టం చూడండి. మా చదువులకు ఆటంకం రాకుండా అరుణా నది దాటేందుకు కేరళ తరహాలో కాలిబాట బ్రిడ్జి ఏర్పాటు చేయండి' అంటూ పిచ్చాటూరు మండలం రజానగరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోరారు. శుక్రవారం వారు అరుణానదిలో నీటి పాయను దాటుతూ ఫొటోతీసి సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి లోకేశ్‌కు తమ సమస్యను విన్నవించారు. ఈ మార్గం గుండా రామగిరి, అడవికండ్రిగ, కాలంజేరి గ్రామాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు బడికి వెళ్లాలంటే ఈ నదిని దాటాల్సిందే. వర్షాకాలం వాగు దాటాలి. ఎండాకాలం ఇసుకలో అడుగు పెట్టాలంటే బొబ్బలెక్కుతాయి. వీరి చదువు సాగాలన్నా.. అటువైపు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిని చేరాలన్నా నదిని దాటాల్సిందే. ఒక్కోసారి అరణియార్ గేట్లు ఎత్తితే నీటి ప్రవాహ ఉధ్రుతి పెరిగి.. పది కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించి పాఠశాలకు చేరుకోవాలి. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను కూటమి ప్రభుత్వమైనా పరిష్కరించాలని వారు కోరారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి



పాఠశాల కోసం అరుణానదిలో నీటి పాయను దాటుతున్న విద్యార్థులు

పక్షుల పండుగకు వేళాయె!

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మరోసారి పక్షుల పండుగకు సమయం వచ్చేసింది. జనవరిలో ఈ పండుగ నిర్వహణకు అధికార యంత్రాంగం సంసిద్ధత వ్యక్తం చేస్తుంటే తమ బకాయిల మాటేంటంటూ మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. 2000వ సంవత్సరంలో మొదలైన ఈ పక్షుల పండుగ 2020 వరకు నిర్విరామంగా అధికార యంత్రాంగం నిర్వహించింది. మూడు రోజులపాటు నేలపట్టులో పక్షుల వీక్షణ, తడ మండలం భీములవారిపాళెంలో పడవ షికారు, సూళ్లూరుపేటలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చే పక్షుల ప్రేమికులతో ఆ మూడురోజులపాటు పండుగ వాతావరణం కనబడేది. 2020 వరకు ఈ పండుగ నిర్వహణ ఇలాగే జరిగింది. ఆ తర్వాత అప్పటి వైసీపీ ప్రభుత్వం పక్షుల పండుగను పక్కన పెట్టేసింది. తద్వారా అటు పర్యాటకులు, ఇటు పక్షుల ప్రేమికులు ఇంచుమించుగా దీనిని మరచిపోయారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పక్షుల పండుగ నిర్వహణకు ముందుకొచ్చింది. పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో 2025 జనవరిలో మూడు రోజులపాటు పక్షుల పండుగ నిర్వహించింది. ఈసారి జనవరి మొదట్లో ఈ పండుగను నిర్వహించేలా జిల్లా అధికారులు నిర్ణయించి ప్రభుత్వానికినివేదికలు పంపుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. ఇప్పటి నుంచి నిర్వహణ పనులు మొదలైతే తప్ప అప్పటికి పూర్తికావన్న ఉద్దేశ్యంతోనే చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం.

మా బకాయిల మాటేంటి?

పక్షుల పండుగ నిర్వహణకు ఏర్పాట్ల దిశగా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంటే.. మత్స్యకారులు మాత్రం తమ పడవ బకాయిల మాటేంటంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. 2020లో పక్షుల పండుగకు ఏర్పాటు చేసిన పడవలకు ఇప్పటికీ బకాయిలు చెల్లించలేదు. ఈ ఏడాది పక్షుల పండుగ సమయంలో పాత బకాయిలను చెల్లించేందుకు కృషి చేస్తామని చెబుతూనే ఈ దఫా బకాయిలు కూడా ఇంకా చెల్లించలేదు. నిధులు విడుదల కాలేదంటూ సదరు అధికారులు మత్స్యకారులకు సర్దిచెప్పి పంపుతున్నారు.

జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా పర్యాటక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించి మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్, నేలపట్టు ప్రాంతాల్లో ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఫెస్టివల్ ప్రచారం కోసం ప్రమోషనల్ వీడియో లేదా టీజర్ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీయూలో అంతర్జాతీయ సదస్సు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న పరిశోధకులు, శాస్త్రవేత్తలు

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేటలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఐసెటిక్స్‌-2025 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, అకడమీషియన్లు, పరిశ్రమ నిపుణులు హాజరయ్యారు. కంప్యూటర్‌ సైన్స్‌ రంగంలోని తాజా ఇన్నోవేషన్‌ అంశాలపై చర్చించారు. తిరుపతి ఐఐటీకి చెందిన డాక్టర్‌ జి.రామకృష్ణ, బెంగళూరులోని సిడాక్‌ యూనివర్సిటీ నుంచి డాక్టర్‌ ఆర్సీ సరిత, ఓమన్‌ యూనివర్సిటీ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ అప్లైడ్‌ సైన్సెస్‌కు చెందిన డాక్టర్‌ రమేష్‌ పాలనిస్వామి ప్రధాన అతిథులుగా పాల్గొని కొత్తగా వస్తున్న సాంకేతిక ధోరణులు, సవాళ్లు, భవిష్యత్‌ అంశాలపై కీలక ప్రసంగాలు చేశారు. దేశంలోని వివిధ సంస్థల నుంచి వచ్చిన పరిశోధనా పత్రాలను పరిశీలించి ఉత్తమమైన వాటిని ప్రదర్శించారు. విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, ఆవిష్కర్తలు, యువ పరిశోధకుల మధ్య జ్ఞాన మార్పిడికి, సహకారానికి ఈ సదస్సు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి డాక్టర్‌ బేబీ మారుతి కన్వీనర్‌గా, డాక్టర్‌ సౌమ్యవాణి కంప్యూటర్‌ అప్లికేషన్స్‌ విభాగాధిపతిగా వ్యవహరించారు.

భక్తుడికి బ్యాగు అప్పగింత



భక్తుడికి బ్యాగును అప్పగిస్తున్న జమేదార్

చంద్రగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భక్తుడు శ్రీవారిమెట్టు మార్గంలో పోగొట్టుకున్న బ్యాగును టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది శుక్రవారం తిరిగి అప్పగించారు. తెలంగాణాకు చెందిన భక్తుడు రవీంద్రారెడ్డి శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే క్రమంలో లగేజీ కౌంటర్‌ వద్ద బ్యాగు మరిచిపోయాడు. అక్కడ విధుల్లో ఉన్న జమేదార్‌ చిరంజీవి దాన్ని గుర్తించి తనవద్ద పెట్టుకున్నారు. కొంతదూరం వెళ్లాక రవీంద్రారెడ్డి బ్యాగు మరిచిపోయిన విషయాన్ని గుర్తించాడు. బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్‌కి ఫోన్‌ చేయడంతో బ్యాగు తన వద్ద ఉందని జమేదార్‌ తెలిపారు. వివరాలు తెలుసుకుని బ్యాగును భక్తుడికి అప్పగించారు. బ్యాగులో రూ.3 వేల నగదు, క్రెడిట్‌, డెబిట్‌ కార్డులు, సెల్‌ఫోన్‌, ఇతర సామగ్రి ఉన్నాయి.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్‌, పక్కన నాగేశ్వరరావు

తిరుపతిరూరల్‌, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తిరుపతి రూరల్‌ మండల ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్‌ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలను జీవనోపాధికి పెట్టుబడిగా పెట్టి కుటుంబ జీవనవిధానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. చిన్న తరహా కుటీర పరిశ్రమల ఏర్పాటు, ఉత్పత్తులను ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫామ్‌ ద్వారా విక్రయాలు చేపట్టడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆర్థిక అవకతవకల నిర్మూలనకు సభ్యులం దరూ డిజిటల్‌ లావాదేవీలు నిర్వహించాలని, మహిళలపై హింసని వ్యతిరేకించాలని సూచించారు. గ్రామ సమాఖ్యలను బలోపేతం చేసుకుని ఎంచుకున్న రంగాల్లో ఔత్సాహికులుగా రాణించాలని ఆకాంక్షించారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్‌ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ పత్తిపాటి నాగేశ్వరరావు, దుర్వాసులునాయుడు, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములు కావాలి



చెరకు పంటను పరిశీలిస్తున్న నీరజ

తిరుపతిరూరల్‌, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగులో రైతులను భాగస్వామ్యం చేసి, తద్వారా కలిగే ప్రయోజనాలను వారికి చేరువచేయాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఎ.నీరజ పేర్కొన్నారు. తిరుపతి రూరల్‌ మండలం వేమూరులోని ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని జిల్లా అధికారులతో కలసి ఆమె శుక్రవారం పరిశీలించారు. ఏటీఎం, ఏ-గ్రేడ్‌, పీఎండీఎస్‌, జీవామృతం ఫిల్టర్‌ చేయకుండా నేరుగా మొక్కకు అందించే నూతన పద్ధతి, చెరకుపంట సాగును పరిశీలించారు. పంటల పెట్టుబడి వ్యయం, దిగుబడి, ఆదాయం, ఎదుర్కొంటున్న సమస్యలను రైతు అయ్యప్పనాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పంటలు వాతావరణ మార్పులను తట్టుకునే శక్తి పెరిగి, లాభాలు చేకూరుతాయని తెలిపారు. సాగువ్యయం తగ్గడమేగాక నేల, ప్రజారోగ్యం, పర్యావరణ రక్షణకు దోహదపడుతుందని వివరించారు. జిల్లా డీపీఎం షణ్ముఖం, అదనపు డీపీఎం పట్టాభిరెడ్డి, రవిచంద్రప్రసాద్‌, గీతారాణి పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటముని

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు వెంకటముని ఘన నివాళి అర్పించారు. శుక్రవారం చంద్రగిరి బస్టాండు కూడలిలో మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సభ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వెంకటముని మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు కృషి చేశారని తెలిపారు. స్వమాక్స్‌ సంస్థ సీఈవో విశ్వనాథ్‌ మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు అందరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు సీఎం కేశవులు, ప్రధాన కార్యదర్శి రావూరి చంద్రశేఖర్‌, ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్‌ మురగయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్‌, మునిరాజు, దొరస్వామి, వెంకటాద్రి, టీపీ ప్రసాద్‌, నరేష్‌కుమార్‌ నాయుడు, బాలకృష్ణయ్య, రామ్మూర్తి, మన్సూర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విశేష అలంకరణలో విరూపాక్షమ్మ

భాకరాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన విరూపాక్షమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా వివిధ రకాల పూజలు చేశారు. శుక్రవారం కళా హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, కుంభ ప్రోక్షణ, అమ్మవారికి అభిషేకం అనంతరం విశేష అలంకరణ చేసి విశ్వరూప దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాని పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సబ్సిడీ పశువుల దాణాను సద్వినియోగం చేసుకోండి

భాకరాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతుల కోసం అందిస్తున్న సబ్సిడీ పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లులో రైతులకు సబ్సిడీ దాణాను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రూ.1100లు విలువజేసే 50 కిలోల పశువుల దాణాను సబ్సిడీపై రూ.550లకే అందిస్తోందన్నారు. మండలానికి 465 బస్తాలు వచ్చాయని, అర్హులైన రైతులందరికీ అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దారు భాగ్యలక్ష్మి, ఏడీ రమణకుమార్‌, సింగిల్‌ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర వాట్సప్‌ గవర్నెన్స్‌ను వినియోగించుకోండి

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మన మిత్ర వాట్సప్‌ గవర్నెన్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి నారాయణరెడ్డి కోరారు. దామినేడులో శుక్రవారం ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి వాట్సప్‌ గవర్నెన్స్‌పై ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏదైనా సేవలు ఈ విధానం ద్వారా పొందవచ్చని తెలిపారు.

వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి

తిరుపతి(వైద్యం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని మానసిక విభాగాధిపతి డాక్టర్‌ పద్మావతి సూచించారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం మానసిక విభాగం ఆధ్వర్యంలో ఎమోషనల్‌ అసెస్‌మెంట్‌ ఇన్‌ స్టూడెంట్స్‌ బై ఎడ్యుకేటర్స్‌(ఈజ్‌) అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలనే విషయాలపై నిపుణులు అవగాహన కల్పించారు. వైద్య విభాగాధిపతులు వెంకటేశ్వర్లు, డీఎస్‌ఎస్‌ మూర్తి, మల్లికార్జున్‌ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఎర్రావారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం తహశీల్దార్‌ పరమేశ్వర స్వామిని ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం సన్మానించారు. ఆదివారం ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండల కార్యాలయానికి వెళ్లి గజ మాల, శాలువతో సన్మానించారు. మండలానికి తహశీల్దార్‌ చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ మండల నేతలు దేశిరెడ్డి రఘునాథ, ఉమామహేశ్వర నాయుడు, నిరంజన్‌ రాయల్‌, చిన్నపరెడ్డి, శివరామిరెడ్డి, మధు, వేణు, శిరివేలే రఘునాథ, విశ్వనాథరెడ్డి, సురేంద్రబాబు, అశోక్‌ రెడ్డి, సుధాకర్‌ నాయక్‌, దేవి, కొమ్మాక లక్ష్మీదేవి, ఎంఈవో బాలసుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో (ముక్కోటి) శుక్రవారం ఆనందవల్లిదేవికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా స్వామివారికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి వివిధ అభిషేకాలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ లక్ష కుంకుమార్చన శోభాయమానంగా సాగింది. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారికి పసుపు, కుంకుమ, గాజులు అందించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

● నారాయణ ప్రీమియర్‌ లీగ్‌ ప్రారంభోత్సవంలో నటుడు శ్రీకాంత్‌



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని ఎంచుకుని సాధన దిశగా పయనించాలని సినీ నటుడు శ్రీకాంత్‌ అన్నారు. చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం సమీపంలోని నారాయణ విద్యాసంస్థల్లో నారాయణ ప్రీమియర్‌ లీగ్‌ క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సినీ నటుడు శ్రీకాంత్‌, తుడా చైర్మన్‌ దివాకర్‌రెడ్డి, నారాయణ విద్యాసంస్థలకు చెందిన ఘంటా రవి, ఏఎస్పీ రవిమనోహరాచారి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. శ్రీకాంత్‌ మాట్లాడుతూ మహిళా క్రికెట్‌ జట్టు ప్రపంచ కప్‌ గెలుపొందడంతో క్రీడలకు మరింత ఆదరణ పెరిగిందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఏఎస్పీ రవిమనోహరాచారి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. తుడా చైర్మన్‌ దివాకర్‌ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. రవి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎంలు శ్రీనివాసులు, రవీంద్రఫణికుమార్‌, ప్రిన్సిపాల్‌ రవికాంత్‌గుప్తా, లీలాధర్‌, శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యం



అన్నదాత సుఖీభవ కరపత్రాలు రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ బద్దలవారిపల్లెలో శుక్రవారం అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసిందన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా ప్రతి రైతుకు రూ.14 వేలు అందించిందని, మూడవ విడత ఫిబ్రవరిలో రూ.6వేలు అందజేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందన్నారు. సీఎం సందేశాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్‌ ఇన్‌చార్జ్‌ శివకుమార్‌, సింగిల్‌ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్‌, ఆర్సీ రమణారెడ్డి, మోహన్‌ రెడ్డి, మదనమోహన, మల్లికార్జున రెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌, మునస్వామి నాయుడు, కృష్ణమూర్తి, గురుమూర్తి, దామోదర్‌, కుమారస్వామి రెడ్డి, కొండారెడ్డి, వెంకటరత్నం, బెల్లంకొండ రమణ, రమేశ్‌, సుబ్రహ్మణ్యం రెడ్డి, హైదర్‌వలీ, లోకనాథం, మౌలాలి పాల్గొన్నారు.

సందడిగా దేవగుడి చిత్ర ట్రైలర్‌ విడుదల



ట్రైలర్‌ రిలీజ్‌ వేడుకలో దేవగుడిచిత్ర హీరో, హీరోయిన్‌ తదితరులు

తిరుపతిరూరల్‌, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దేవగుడి చిత్ర ట్రైలర్‌ విడుదల శుక్రవారం సందడిగా జరిగింది. రూరల్‌ మండలం గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్‌ కళాశాల, జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో విద్యార్థుల సమక్షంలో చిత్ర యూనిట్‌ ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో అభినవ్‌ శౌర్య, హీరోయిన్‌ అనుశ్రీ, దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. గాయని చిత్ర పాడిన పాటను విడుదల చేశారు. అభినవ్‌ శౌర్య మాట్లాడుతూ.. హీరో కావాలని 12ఏళ్లపాటు కష్టపడ్డానని, ప్రేక్షకులు ఆశీర్వదించాలని కోరారు. విద్యార్థుల కేరింతల నడుమ హీరోయిన్‌ అనుశ్రీ సినిమాలోని కొన్ని డైలాగులు చెప్పింది. నిర్మాత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రం వచ్చేనెల 19న విడుదల కానుందని, ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమాలో ఓ పాటకు హీరో, హీరోయిన్‌ స్టెప్పులేసి అలరించారు. సిద్ధార్థ కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వ్యవసాయ వర్సిటీ పాలకమండలి మాజీ సభ్యుడు టీవీ మురళీనాథరెడ్డి, విశ్వం స్కూల్‌ అధినేత డాక్టర్‌ ఎన్‌.విశ్వనాథరెడ్డి, అకడమిక్‌ డైరెక్టర్‌ ఎన్‌.విశ్వచందన్‌రెడ్డి, విద్యార్థులు, అపుస్మా నాయకులు పాల్గొన్నారు. 28సీఆర్‌ఐ10) ఇంటింటా ప్రచారం చేస్తున్న సచివాలయ అధికారి నారాయణరెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, నవంబర్‌ 28(ఆంధ్రజ్యోతి); రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని కోటకాడపల్లెలో శుక్రవారం రాత్రి అన్నదాత సుఖీభవ పథకం గురించి ఆయన ప్రచారం చేశారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దేశిరెడ్డి రఘునాథ, ఉమామహేశ్వర నాయుడు, నిరంజన్‌ రాయల్‌, చిన్నపరెడ్డి, శివరామిరెడ్డి, మధు, రమణారెడ్డి, లక్ష్మీదేవి, నాగరాజు, నాగరాజ, వేణుగోపాల్‌, సుధాకర్‌, అశోక్‌ రెడ్డి, కేశవులు నాయుడు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల క్రీడలు ప్రారంభం



పరుగుపందెంలో దివ్యాంగ క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీ ఆర్ట్స్‌ కాలేజీ మైదానంలో శుక్రవారం ఉదయం విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారిలోని ప్రతిభను వెలికితీయడం, సామర్థ్యాలను ప్రోత్సహించడం, శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడం, సమాజంలో సమాన భాగస్వామ్యం కల్పించడం వంటి లక్ష్యాల దిశగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజున ట్రైసైకిల్‌ రేస్‌, వీల్‌చైర్‌రేస్‌, రన్నింగ్‌, లాంగ్‌జంప్‌, షాట్‌పుట్‌, కబడ్డీ, త్రోబాల్‌ వంటి పోటీలు నిర్వహించారు. అత్యవసర వైద్యసేవలు, తాగునీరు, అల్పాహారం, రవాణా వంటి సదుపాయాలు కల్పించారు. ముఖ్య అతిథులుగా ఎస్సీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పి.యుగంధర్‌, ఉపసంచాలకులు అరుణ్‌కుమార్‌, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

ఆ రెండు మెడికల్‌ షాపులను రద్దు చేయండి



రుయా సీఎస్‌ఆర్‌ఎంవో వినతిపత్రం ఇస్తున్న విజయభాస్కర్‌

తిరుపతి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : రుయా ఆస్పత్రి లో రాజకీయ నేతల ఒత్తిళ్లతో నిబంధనలకు విరుద్ధంగా కేటాయిస్తున్న మెడికల్‌ షాపులను రద్దు చేయాలని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు. ఆ మేరకు నవ సమాజ ఫెడరేషన్‌ (ఎన్‌ఎస్‌ఎఫ్‌) వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నీల విజయభాస్కర్‌ శుక్రవారం రుయా సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్‌ బి.సుబ్బలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. జీవో నెంబరు 516 నిబంధనల మేరకు వెయ్యి పడకలు దాటిన ఆస్పత్రిలో మూడు మెడికల్‌ షాపులు మాత్రమే ఉండాలని, ఆ మేరకు రుయా ఆస్పత్రిలో ప్రస్తుతం 3 మెడికల్‌ షాపులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనరిక్‌ మెడికల్‌ షాపు కూడా ఉందన్నారు. ఉన్నతాధికారులను తప్పుదోవపట్టించి ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని, వెంటనే విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు.

టీటీడీ ఉద్యోగులకు ప్రమాద బీమా రూ.కోటి



టీటీడీ ఈవోతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎస్‌బీఐ అధికారులు

తిరుపతి(ఆటోనగర్‌) నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాలో ఖాతా వున్న టీటీడీ ఉద్యోగులకు కోటి రూపాయలు ఉచిత ప్రమాద బీమా, హెల్త్‌ ఇన్సూరెన్స్‌ కల్పించడానికి ఈవోతో శుక్రవారం రాత్రి అవగాహన ఒప్పందం కుదిరినట్లు ఆ బ్యాంక్‌ రీజనల్‌ మేనేజర్‌ ఎస్‌.వెంకటేశ్వర రావు తెలిపారు. స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాలో టీటీడీ వేతన ఖాతాలు ఉన్న ఉద్యోగులకు వర్తించేవిధంగా, రూ.50 లక్షలతో హెల్త్‌ ఇన్సూరెన్స్‌ టాప్‌-అప్‌, ఇతర ప్రయోజనాలు అందించడానికి ఎంఓయూ కుదిరిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్‌ డీజీఎం దినేష్‌ గులాఠీ, టీటీడీ ఎఫ్‌ఏసీఏఓ బాలాజీ, డిప్యూటీ ఈవో వెల్‌ఫేర్‌ విభాగం అధికారి ఆనందరాజు పాల్గొన్నారు.

వెటర్నరీ కాలేజీ విద్యార్థి ప్రియదర్శిని ప్రతిభ

● వ్యాసరచన పోటీలో ప్రథమస్థానం



సర్టిఫికెట్‌, బహుమతి అందుకుంటున్న విద్యార్థి ప్రియదర్శిని

తిరుపతిరూరల్‌, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలలో బీవీఎస్సీ నాల్గవ సంవత్సరం చదువుతున్న ఎ.ప్రియదర్శిని హైదరాబాద్‌లో నిర్వహించిన పౌల్ట్రీ ఎక్స్‌పో సదస్సులో ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ వి.జగపతిరామయ్య పేర్కొన్నారు. కోళ్లలో సంక్రమించే కాక్సిడియోసిస్‌ వ్యాధి నివారణకు సహజ ఆహార-యాజమాన్య పద్ధతులు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి సాధించిందని వివరించారు.

‘టీటీడీని దోచుకున్న దొంగలకు శిక్ష తప్పదు’

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలకు త్వరలో జైలు శిక్ష తప్పదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్‌ పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సహజ వనరులతోపాటు శ్రీవారి సొమ్మును కూడా వైసీపీ నాయకులు దోచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని విమర్శించారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో అపవిత్రం చేసిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. శ్రీవారికి భక్తులు ఎంతో భక్తితో సమర్పించే కానుకలను రవికుమార్‌ కాజేస్తే, ఆయనపై కేసు రాజీ చేసి, అతని ఆస్తులు, కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. కేసు పెట్టిన ఏవీఎస్వో సతీష్‌ హత్య వెనుక వైసీపీ నాయకుల పాత్ర ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

అమ్మవారి సేవలో రాజేంద్రప్రసాద్‌



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో రాజేంద్రప్రసాద్‌

తిరుచానూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని శుక్రవారం రాత్రి టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ, పంచాయతీరాజ్‌ ఛాంబర్‌ జాతీయ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌ చాంబర్‌ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య వారి వెంట ఉన్నారు.

సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్‌ మధుశేఖర్‌

తిరుచానూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి అని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని తిరుపతి రూరల్‌ సింగిల్‌విండో చైర్మన్‌ మధుశేఖర్‌ అన్నారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి రూరల్‌ మండలం ముండ్లపూడి గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో డైరెక్టర్‌ మోహన్‌రెడ్డి, విజయకుమార్‌నాయక్‌ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపుతాం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన ప్రతి రెవెన్యూ సమస్యకూ పరిష్కారం చూపుతామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్‌ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్‌ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన భూ అక్రమాల కారణంగా రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయన్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 53 వినతులు అందగా వాటన్నింటినీ సంబంధిత వీఆర్వోలకు అందించి పరిష్కరించి తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్‌, తహసీల్దారు భాగ్యలక్ష్మి, ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూలే గొప్ప సంస్కర్త

వర్ధంతి సభలో ఎస్వీయూ వీసీ నరసింగరావు



సభలో ప్రసంగిస్తున్న వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంలోని అసమానతలను రూపుమాపేందుకు ప్రయత్నించిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఎస్వీయూ వీసీ నరసింగరావు పేర్కొన్నారు. యూనివర్సిటీ సెనేట్ హాల్లో శుక్రవారం నిర్వహించిన పూలే వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అణగారిన వర్గాల విద్య కోసం, స్త్రీ అభ్యున్నతి కోసం, బాలికల చదువు కోసం పూలే జీవితకాలం శ్రమించారన్నారు. రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ సత్య శోధక్ సమాజ్‌ను స్థాపించి, విద్యతో పాటు వ్యవస్థీకృత సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. పూలే రాసిన గులాంగిరి పుస్తకాన్ని చదవాలని కోరారు. సీడీసీ డీన్ చంద్రాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మీడియా డీన్ వీసీ వేంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం

పూలే వర్ధంతి సందర్భంగా ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ రక్తదాన శిబిరం చేపట్టింది. 30 మంది రక్తదానం చేశారు. 70 మందికి రక్త పరీక్షలు చేశారు. దాతలను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, సీఐటీయూ నేత కందారపు మురళి, ఎస్వీయూ హెల్త్ సెంటర్ డాక్టర్ అలేఖ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు అశోక్, వినోద్, రవి, అక్బర్, గీతాంజలి, పవిత్ర పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి



పూలేకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, బీసీ నేతలు

తిరుపతి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఉదయం బాలాజీకాలనీలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఘన నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన సంఘ సంస్కర్త పూలే అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, బీసీ సంఘర్షణ సమితి సమన్వయకర్త అశోక్‌సామ్రాట్ యాదవ్, అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సాకం ప్రభాకర్, రమణ, సుబ్రహ్మణ్యం యాదవ్, కరాటే చంద్ర, వరప్రసాద్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరి

తిరుపతి(క్రీడలు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన 69వ అంతర్ జిల్లాల అండర్ 17 ఎస్జీఎఫ్ బాలికల కబడ్డీ టోర్నమెంటులో శ్రీపద్మావతి కళాశాల బాలికలు ప్రతిభచాటారు. ఎం.లిఖిత, బి.పి. లోహిత కబడ్డీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డి.హంపి, ఈ.సౌమ్య రాజమండ్రిలో జరిగిన కరాటే పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భువనేశ్వరి వారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము సాధించిన మెడల్స్, ట్రోఫీలను ప్రదర్శించారు.

రేపు భగవద్గీత కంఠస్థ పోటీలు

తిరుపతి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం భగవద్గీ కంఠస్థ పోటీలు నిర్వహించనున్నారు. టీటీడీ విద్యాసంస్థలతో పాటు స్థానికంగా చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చు. 14వ అధ్యాయం (గుణత్రయ విభాగ యోగం)లో 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు, 10వ తరగతి విద్యార్థులకు 16వ అధ్యాయం(దైవాసుర సంపద్విభాగయోగం)లో పోటీలు ఉంటాయి. 18నుంచి 45సంవత్సరాల లోపు వారికి నిత్యజీవితంలో భగవద్గీత-భావ విశ్లేషణ అనే అంశంపై పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తిగలవారు ఆ రోజున ఉదయం 9గంటలకు అన్నమాచార్య కళామందిరానికి చేరుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9676615643, 8500049345లను సంప్రదించాలని టీటీడీ అధికారులు కోరారు. గెలుపొందిన వారికి గీతాజయంతి సందర్భంగా డిసెంబరు 1వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు.

రేపు మ్యారేజ్ మీడియేటర్స్ సదస్సు

తిరుపతి(జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల మ్యారేజ్ మీడియేటర్స్ సమావేశం ఆదివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు న్యూ సమైక్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పట్టాభి రామయ్య తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఏపీ, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా నుంచి 500మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో మ్యారేజ్ మీడియేటర్స్ సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరిరావు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.



స్విమ్స్‌లోని వైద్య విద్యార్థుల వసతిగృహ పరిసరాల్లో తాగి పడేసిన మద్యం బాటిళ్లు

మందుబాబులకు అడ్డాగా స్విమ్స్

- వసతిగృహాలు, భవన పరిసరాల్లో మద్యం తాగుతున్న అల్లరిమూకలు
- ఆందోళనలో వైద్య విద్యార్థినులు, రోగులు

తిరుపతి(వైద్యం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్యసేవలు అందించే స్విమ్స్ మందుబాబులకు అడ్డాగా మారింది. స్విమ్స్ ఆవరణలో అడుగడుగునా సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ పలు వసతి గృహాలు, భవనాల పరిసరాల్లో మందుబాబులు మద్యం తాగుతున్నారు. ప్రధానంగా పద్మావతి ఆస్పత్రి భవనానికి వెళ్లే మార్గంలోని మహిళా వైద్య విద్యార్థుల వసతి భవనం సమీపంలో, పక్కనే నిర్మాణంలో ఉన్న మరో భవనం పరిసరాల్లో రాత్రిళ్లు మద్యం తాగి ఖాళీ బాటిళ్లను అక్కడే వదిలేసి వెళుతున్నారు. వసతిగృహంలోని మహిళా వైద్య విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం వస్తుందోనని భయపడుతున్నారు. రోగులు రాత్రిపూట ఆస్పత్రి లోపలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రి పరిసరాల్లో ఎలాంటి అనర్థాలు చోటుచేసుకోక ముందే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వేద విజ్ఞానమే మన జీవన విధానం

ఉపనిషద్వింశతి పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానమే మన జీవన విధానమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. చెన్నైకి చెందిన రచయిత టి.ఆర్.యు.శర్మ రచించిన ఉపనిషద్వింశతి రెండవ భాగం ఆవిష్కరణ సభ శుక్రవారం ఓరియంటల్ కాలేజీలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీతారామరావు మాట్లాడుతూ యువత తమ కర్తవ్యం నిర్వహించాలనే లక్ష్యంతో రచయిత ఉపనిషత్తుల సమష్టి సారాన్ని సులభ శైలిలో పుస్తకంగా తెచ్చారని అభిప్రాయపడ్డారు. అధ్యాపకులు నారాయణస్వామిరెడ్డి, తెలుగు విభాగాధిపతి హేమంత కుమార్, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు ప్రసంగించారు. యువ ప్రవచనకర్త మద్దూరి ఆదిత్యశర్మ సమీక్షించారు. తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత శర్మను సత్కరించారు. అధ్యాపకులు కొణిదెల పురుషోత్తం, మన్నవ గంగాధర ప్రసాద్ గుడిమెట్ల చెన్నయ్య, పి.ఆర్.కేశవులు, మల్లేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, వెంకటరమణ ప్రసాద్, కాంతారావు పాల్గొన్నారు.

రోబోటిక్ పరిజ్ఞానంతో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దినేష్ మన్ని

తిరుపతి(జీవకోన), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ పరిజ్ఞానంతో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్నట్లు బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రి అర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దినేష్ మన్ని అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రోబోటిక్స్ పరిజ్ఞానంతో శస్త్ర చికిత్స చేయడం ద్వారా నొప్పి తక్కువగా ఉంటుందన్నారు. నొప్పికి భయపడి చాలామంది సర్జరీలు చేసుకోకుండా ఉంటున్నారని, అలాంటి వారికి ఇది ఎంతగానో ఉపయోపడుతుందని అన్నారు. తిరుపతిలోని వెంకటరమణ హార్ట్ ఆస్పత్రి వద్ద ప్రతినెలా మూడవ శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కన్సల్టెన్సీ ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాదర్బార్‌కు స్పందన



వినతిపత్రాలు స్వీకరిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ నివాసంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి పరిష్కరించాలని ఆమె కోరారు. టీడీపీ నేతలు కోడూరు బాలసుబ్రమణ్యం, చినబాబు, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, పుష్పావతి, కరాటే చంద్ర, విశ్వనాథం పాల్గొన్నారు.

రాగ సుధామృతం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెలవారి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో గాత్ర కచేరి నిర్వహించారు. ప్రముఖ గాయని రాగసుధ నిర్వహించిన గాత్ర కచేరి శ్రోతలను అలరించింది. హరి నీవు మాలోన, షణ్ముఖ ప్రియ, ఇదివో ఉన్నారము, శుద్ధ దన్యాసి, ఎందాక చూతము, హంస నాదం, తేనెయు నీవు నంపేయు, సారంగ, అవధరించగదవయ్యా, మధువంతి వంటి సంకీర్తనలను ఆలపించి ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ కచేరికి కీబోర్డుపై శ్రీనివాసులు, తబలాపై మురళి వాద్య సహకారం అందించారు.

పూలే ఆశయ సాధనకు కృషిచేద్దాం



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్

తిరుపతి (జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా బాలాజీ కాలనీ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంరక్షణ సమితి నాయకులు అశోక్ సామ్రాట్‌యాదవ్, అక్కినపల్లి లక్ష్మయ్య, రామచంద్ర యాదవ్, శాకం ప్రభాకర్, లక్ష్మయ్య యాదవ్, రమణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి

తిరుపతి(జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని వేదనారాయణస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సనాతన ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్‌కుమార్, హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ టీటీడీకి చెందిన ఆలయ భూములను స్థానిక వీఆర్వో నాగభూషణం తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. గుడిమాన్యాన్ని ఆక్రమించుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీఏ యాక్ట్ కింద దరఖాస్తు చేసుకున్నా తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శి సమాచారం ఇవ్వడం లేదన్నారు. టీటీడీ ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

అసమానతల నిర్మూలనకు పునాది పూలే



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు28(ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతల నిర్మూలనకు 150 ఏళ్ల క్రితమే పోరాడి, ఆచరించిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ కె.గురవయ్య పేర్కొన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు పుష్పాంజలి ఘటించారు. గురవయ్య మాట్లాడుతూ సమాజంలో అసమానతలను గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పూలే ఎంతో కృషి చేశారన్నారు. స్త్రీలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎదురవుతున్న సాంఘిక దురాచారాలను అడ్డుకున్న వ్యక్తి పూలే అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. అంతకుముందు కార్యాలయ ప్రాంగణంలోని పూలే విగ్రహానికి విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఎల్.చలపతి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు జె.రమణాదేవి, ఎన్.శోభావాలంటీనా, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్దన నాయుడు, సంస్థ జాయింట్ సెక్రటరీ ఎం.గోపాలకృష్ణ, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారు

మంగళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రేణిగుంట-కడప రహదారిలోని అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తిరుపతి అటవీశాఖ అధికారులు 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. అటవీ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు గురువారం రాత్రి నుంచి అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము మూడు గంటలకు అటువైపుగా ఒక కారు వేగంగా వస్తుండటంతో ఆపేందుకు ప్రయత్నించారు. కొంతదూరం వెళ్లి శ్రీనివాసపురం వద్ద కారును ఆపి డ్రైవర్ పారిపోయాడు. అందులో తనిఖీ చేయగా 8 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. కారుతో సహా వాటి విలువ రూ.6లక్షలు ఉంటుందని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో డీర్వో ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, కరకంబాడీ బీట్ ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, ప్రసాద్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.

'టీటీడీ ఛైర్మన్‌ను బెదిరించడం ఏమిటి?'

తిరుపతి(జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్‌ను బెదిరిస్తూ, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ సేవ్ టెంపుల్స్, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాష్‌రావు వెలగపూడి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని శివకామేశ్వరి శక్తిపీఠం శివానందస్వామి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టీటీడీ వంటి అతిపెద్ద హిందూ ధార్మిక సంస్థ గురించి తప్పుడు ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. టీటీడీ పేరుతో అడ్డదారిలో విరాళాలు వసూలు చేస్తుంటే బాధ్యత కలిగిన ఛైర్మన్‌గా ఆ సంస్థలకు విరాళాలు ఇవ్వవద్దని పత్రికా ప్రకటన ఇచ్చారని తెలిపారు.

హైకోర్టు స్టేతో మళ్లీ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనందరెడ్డి

రేణిగుంట నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద్‌రెడ్డి కోర్టు స్టేతో మళ్లీ విధుల్లో చేరారు. రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇటీవల అయన్ను సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈక్రమంలో ఆనందరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఆనందరెడ్డి విధుల్లోకి హాజరయ్యేందుకు అనుమతులు జారీ చేశారు. ఈ మేరకు చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ మునిశంకరయ్య ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం ఆనందరెడ్డి మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.

నేడు కబీరు కవితల అనువాద గ్రంథం ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కవి కబీరుదాసు రాసిన వంద కవితలను రవీంద్రనాథ్ ఠాగూర్ 'హండ్రెడ్ పోయెమ్స్' పేరుతో అనువదించారు. దీన్ని తిరుపతికి చెందిన కవి తిరువాయిపాటి రాజగోపాల్ తెలుగులోకి అనువదించారు. బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటలకు ఆవిష్కరించనున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర పుస్తకావిష్కరణ చేస్తారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతారావ్‌పూలే ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని బీజేపీ నాయకులు కోరారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని బాలాజీ కాలనీలోని విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. బీజేపీ నేతలు వరప్రసాద్, గుండాల గోపినాథ్‌రెడ్డి, కట్టమంచి చంద్రబాబుయాదవ్, లోక ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.



అమ్మవారికి తిరువీధి ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఘనంగా తిరువీధి ఉత్సవం జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తికి మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవిని తిరుచ్చిపై కొలువుదీరి రాత్రి తిరుమాడవీధుల్లో ఊరేగించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు

పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పదిరోజులుగా ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు ఎస్వీయూలో 'అన్వేషణ్'


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలోని సెనేట్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు 'అన్వేషణ్-2025' కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు రీసెర్చ్ పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్, ఇన్నోవేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం

హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,548
తలనీలాలు సమర్పించినవారు: 25,781



వెటర్నరీ వర్సిటీ పాలకమండలి ఎప్పటికో?

రెండేళ్లు గడుస్తున్నా నియామకం లేదు ● వీసీ నుంచి అధికారుల వరకు ఇన్‌చార్జులే

తిరుపతిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీలో రెండేళ్లుగా రెగ్యులర్ పాలకమండలి(ఈసీ)ని నియమించలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఈసీసభ్యుల పదవీకాలం ముగిసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. దీంతో 2023 అక్టోబరు నుంచి వర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేదు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్ పద్మనాభరెడ్డిని తిరిగి రెండోదఫా వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో అప్పట్లో కొందరు ప్రొఫెసర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. యూజీసీ నియమ, నిబంధన ప్రకారం చట్టసవరణ(అమెండ్‌మెంట్) చేసి వీసీ నియామక నోటిఫికేషన్‌ని జారీ చేయాలని న్యాయస్థానం తీర్పునివ్వడంతో ఆయన నియామకానికి బ్రేక్‌పడింది. ఆ క్రమంలోనే 2023 డిసెంబరు నెలాఖరులో ఐసీఏఆర్‌కి చెందిన ఓ ఎక్స్‌అఫిషియో సభ్యుడు పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి వర్సిటీకి ఎక్స్‌అఫిషియో, పూర్తిస్థాయి పాలకమండలి(ఫుల్‌బోర్డు), రెగ్యులర్ వీసీని నియమించలేదు. గతనెల 28న వర్సిటీలో 253 టీచింగ్ ఖాళీ పోస్టుల (81బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు) భర్తీకి అనుమతిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



వీటిని భర్తీ చేయాలంటే బోర్డు అనుమతి తీసుకోవాలి. అయితే వర్సిటీలో ఫుల్‌బోర్డు లేకపోవడం, న్యాయస్థానంలో పలు కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఈ పోస్టులను భర్తీ చేస్తారా లేదా అన్న అయోమయంలో అధ్యాపకులున్నారు. ఈనేపథ్యంలో వర్సిటీకి కొత్తపాలకమండలి నియామకం ఎపుడు ఉంటుందనేది చర్చగా మారింది.

అక్కడందరూ ఇన్‌చార్జులే

వర్సిటీలో వీసీ నుంచి యూనివర్సిటీ ఆఫీసర్ల వరకూ అందరూ ఇన్‌చార్జీలుగానే వ్యవహరిస్తున్నారు. 2024 జూలై 19 నుంచి ప్రొఫెసర్ జేవీరమణ ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. గతనెలలో ముగ్గురు రెగ్యులర్ యూనివర్సిటీ ఆఫీసర్ల మూడేళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో ఇప్పుడు వీసీ, రిజిస్ట్రార్, వెటర్నరీసైన్స్ డీన్, డీఆర్, డీఈ, సీవోఈ, కంప్ట్రోలర్, డెయిరీడీన్ పోస్టులలో తాత్కాలికంగా ఇన్‌చార్జులే ఉన్నారు. దీంతో ఉద్యోగుల సర్వీస్‌మేటర్స్, ఫైనాన్షియల్ అప్రూవల్స్ వంటి సమస్యలతో ఉన్నతాధికారవర్గాలు సతమతమవుతున్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగుల, సీఏఎస్ అధ్యాపకుల పదోన్నతులు నిలిచిపోయాయి. రెండు కాన్వొకేషన్లు పెండింగ్‌లో ఉండడంతో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఒరిజనల్ డిగ్రీల కోసం ఎదురు చూస్తున్నారు. తాత్కాలిక ఇన్‌చార్జులైన అధికారులు నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితితో అజమాయిషి, పర్యవేక్షణ కొరవడి వర్సిటీ పాలనగాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వందకు చేరిన కోర్టు కేసులు

వర్సిటీకి సంబంధించి వంద కోర్టు కేసుల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. వీటిలో పలువురు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కేసులే ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటివరకు వర్సిటీ ఉన్నతాధికారవర్గాలు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేక చిన్నాచితక సమస్యల పరిష్కారానికి కూడా ఉద్యోగులు, బాధితులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

తిరుమలకు పూర్తిగా విద్యుత్ బస్సులు

దశలవారీగా డీజల్, పెట్రోల్ ట్యాక్సీలు, టీటీడీ అద్దెవాహనాల రద్దు ● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పూర్తిగా విద్యుత్ వాహనాలనే వినియోగంలోకి తీసుకురావడానికి విస్తృత చర్యలు చేపట్టినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, ఆర్టీసీ, టీటీడీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పవిత్రత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని పాత డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగాన్ని క్రమంగా రద్దు చేయనున్నట్టు వివరించారు. తొలిగా తిరుపతి, తిరుమల మధ్య పూర్తిగా విద్యుత్ బస్సులు మాత్రమే నడిచే ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. తిరుమలలో నడిచే ట్యాక్సీలు, టీటీడీ అద్దె వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను దశలవారీగా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. త్వరలో జరుగనున్న టీటీడీ బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధి కునాల్ జోషి వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, వీజీవో సురేంద్ర, ఐటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు నాయుడు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

లింగ వివక్షను రూపుమాపాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చైతన్యంతో ముందుకు వచ్చి లింగ వివక్షతను నిర్మూలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళలపై హింసవ్యతిరేక దినం సందర్భంగా నయీ చేతన4.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెలరోజులు జెండర్ సమానత్వ ప్రచారంనిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు శోభన్‌బాబు, సుశీలాదేవి, వసంతబాయి, శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నారావారిపల్లె పెండింగ్‌పనులు పూర్తి చేయాలి

స్వర్ణనారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవితోపాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్‌స్టేషన్, రంగంపేట స్కూల్ నిర్మాణం, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోకుంటే కార్డుల రద్దు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంకా ఈకేవైసీ చేసుకోలేదా? అలాగైతే రేషన్ కార్డులు రద్దవుతాయి. ఈ నెలాఖరుకు గడువు ఉంది. జిల్లాలో 5,87,001 కార్డులున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 70 వేల వరకు ఈకేవైసీ చేసుకోలేదని తెలిసింది. వీళ్లు ఏ మాత్రం ఈకేవైసీ చేసుకోకుంటే ఈనెలాఖరుకు రేషన్ కార్డులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక, రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండడానికి ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు పంపిణీ చేసింది. ఇందులోనూ ఇప్పటి వరకు దాదాపు 61,203 కార్డులు సచివాలయ సిబ్బంది వద్దే ఉన్నట్లు సమాచారం.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేశాం



● జీఎం అమరేంద్ర రెడ్డి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టెలికం జిల్లా (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో గడిచిన నాలుగేళ్లలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నెట్‌వర్క్‌ను బలోపేతం చేశామని బీఎస్ ఎన్ఎల్ జీఎం సి.అమరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాలో ఫైబర్ నెట్‌వర్క్ వినియోగ దారులు 30 వేల మందికిపైగా ఉన్నారని తెలిపారు. వారి సేవలకు అంతరాయం లేకుండా నెట్‌వర్క్‌ను సరిదిద్దామని చెప్పారు. కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా జిల్లాకు మరో 75 టవర్లు వస్తాయని చెప్పారు. దీంతో సెల్‌ఫోన్ల సేవలు మరింత మెరుగుపడతాయన్నారు. చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, పీలేరు, పుత్తూరు, వాల్మీకిపురం, పాకాల నుంచి తిరుపతి టెలికం జిల్లా కేంద్రానికి 10జీ స్పెట్రంను 100జీకి పెంచామన్నారు. దీంతో ఇంటర్నెట్ వాడకం 2200 టెరాబైట్ పెరిగిందన్నారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరింప జేశామన్నారు.

విశాఖకు గూగుల్ పెద్ద గేమ్ ఛేంజర్

● ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తిరుమల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంకు గూగుల్ సంస్థ రావడంతో పెద్ద గేమ్ ఛేంజర్‌గా మారబోతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సినీనటులు శ్రీకాంత్, అశోక్‌తో కలిసి శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, గతంలో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అద్భుతమైన మార్పులు జరిగాయని గుర్తు చేశారు. సైబరాబాద్ వంటి నగరం ఏర్పాటు కావడంలో మైక్రోసాఫ్ట్ కీలకంగా వ్యవహరించిందన్నారు. ఇదే తరహాలో గూగుల్ రాకతో విశాఖపట్నం కూడా ప్రపంచగుర్తింపు నగరంగా అభివృద్ధి చెందబోతోందన్నారు. రిలయన్స్, టీసీఎస్ వంటి అనేక సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయన్నారు. కాగా, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



శ్రీకాంత్, గంటా శ్రీనివాసరావు, అశోక్ - జస్టిస్ ఏవీ శేషసాయి

జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలి

మెడికల్ డీలర్లను ఆదేశించిన జీఎస్టీ సంయుక్త కమిషనర్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మెడికల్స్‌పై ప్రభుత్వం జీఎస్టీ 2.0 తగ్గించిన ప్రయోజనాన్ని వినియోగదారులకుతప్పనిసరిగా అందించాలని చిత్తూరు డివిజన్ రాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాపారులకు స్పష్టం చేవారు. శుక్రవారం ఆయన డ్రగ్స్, మెడికల్ ఏజెన్సీల హోల్‌సేల్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, రీటైలర్లతో తిరుపతి కమర్షియల్‌టాక్స్ కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. జీఎస్టీ అమలు ప్రక్రియలో వినియోగదారులకు అందాల్సిన ప్రయోజనాలను అందజేయకుంటే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త జీఎస్టీ రేట్ల అమలుపట్ల ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు రెగ్యులర్ కేటగిరీకి మార్చాల్సిన అవసరం, ప్రొఫెషన్ టాక్స్ చెల్లింపు తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, రిటర్న్‌లను సమయానికి దాఖలు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరామగుప్త, ప్రతినిధులు నరసింహారెడ్డి, కుమార్, శశి, శివ తదితరులు పాల్గొన్నారు.

కాసులిస్తే కానీ కదలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు!

ఉచితం మాటున డ్రైవర్ల చేతివాటం ● ప్రసూతి ఆస్పత్రిలో బాలింతల అవస్థలు

● పిచ్చాటూరుకు చెందిన ధనలక్ష్మి మూడు రోజుల కిందట ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్నారు. శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని అడగ్గా రూ.3 వేల వరకు డిమాండ్ చేశారు. చివరకు రూ.2 వేలకు బేరం కుదుర్చుకుని వెళ్లారు.

● రైల్వేకోడూరుకు చెందిన రేణుక శుక్రవారం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం కోసం డ్రైవర్‌ను సంప్రదించారు. మీది వేరే జిల్లా వస్తుందని అక్కడ వరకు ఉచితంగా రావడం కుదరదని చెప్పారు. ప్రైవేటు వాహనంలో వెళ్లాలంటే కనీసం రూ. 8 వేలు అడగతారని, రూ.4 వేలు చెల్లిస్తే విడిచిపెడతామని చెప్పడంతో చివరకు రూ.3 వేలకు బేరం కుదుర్చుకొన్నారు.

..ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల తర్వాత క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రభుత్వం తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 29 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రభుత్వం అందించింది. వీటిల్లో 19 తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి కేటాయించారు. ప్రసూతి ఆస్పత్రిలో సగటున రోజుకు 20 మందికి పైగా డిశ్చార్జి అవుతుంటారు. వీరిని ఉచితంగా ఇంటి వద్ద విడిచిపెట్టేందుకు అందుబాటులో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు ముందుగానే బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఈ వాహనాలు ఉచితంగా కదా అని ఎవరైనా అడిగితే వాహనాలు మాత్రమే ఉచితమని పెట్రోలు, వాహన శుభ్రత, టోల్‌గేట్లు ఇలా చెల్లించాలని చెప్పి ముందుగానే నగదు వసూళ్లు చేస్తున్నారు. అంత ఇచ్చుకోలేని వారు ఆటోలను, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు షెడ్డులోఉన్నా బేరం కుదరకుంటే తీయడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రవేటు వాహనాల్లో ఇళ్లకు వెళుతున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు పూర్తిగా ఉచితమని, ఎవరైనా డబ్బు అడిగితే ఫిర్యాదు చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ చెప్పారు. ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.



ఆటోలో వెళుతున్న బాలింతలు.. షెడ్డులో ఉన్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల డిమాండ్ మేరకు 41 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. డిసెంబర్ 1నుంచి మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి-షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు,డిసెంబర్ 2 నుంచి 9వరకు(మంగళ) రామేశ్వరం-తిరుపతి(06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని తెలిపారు.

భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు



తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు లభించింది. ధార్మిక, సమాజ సేవా కార్యక్రమాలు చేసిన వారికి భారత్ గౌరవ్ సంస్థ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో 2025వ సంవత్సరానికి భానుప్రకాష్‌రెడ్డిని ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిన్న జీయర్ స్వామి చేతులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుల గడువు ఆదివారంతో ముగుస్తుందన్నారు.

కుటుంబ కలహాలతోనే

తిరుమలలో ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం



గణేష్

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం ఆత్మహత్యకు యత్నించిన గణేశ్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ఆర్బీ సెంటర్ వద్ద బటన్ కట్టర్‌తో పొట్ట, గొంతు కోసుకుని, కడుపులోని పేగులను సైతం బయటకు లాగి ముక్కలు చేసి కుప్పకూలిపోయాడు. స్విమ్స్‌లో శుక్రవారం ఉదయం స్పృహలోకి వచ్చాడు. చెన్నైకి చెందిన గణేశ్ భార్య ఇందిరకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. కుటుంబ కలహాలతో గణేశ్ 15 రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. మానసిక పరిస్థితి కూడా బాగాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ గూడూరు కోర్టు న్యాయమూర్తి కె.నాగపవన్ తీర్పు ఇచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... నెల్లూరు జిల్లా రాపూరు మండలం వేపినాపి గ్రామానికి చెందిన మోడిబోయిన వెంకటేశ్వర్లు మద్యానికి బానిసై తరచుగా భార్యను కొడుతుండేవాడు. దీంతో ఆమె తన పిల్లలతో కలిసి ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఓజిలి మండలం కారూరులో తన తాత ఇనుగుంట శ్రీనివాసులు వద్ద ఉంటోంది. వెంకటేశ్వర్లు తరచూ కారూరుకు వెళ్లి భార్య పిల్లలను పంపమని శ్రీనివాసులతో గొడవపడుతుండేవాడు. ఎంతకీ తన భార్యపిల్లలను పంపకపోవడంతో శ్రీనివాసులును హత్య చేసేందుకు వెంకటేశ్వర్లు పథకం పన్నాడు. 2019 జూన్ 24వ తేదీ రాత్రి 7:30 గంటల సమయంలో కారూరులో ఇంటి బయట నిద్రపోతున్న శ్రీనివాసులును గొడ్డలితో మెడమీద నరికి చంపేశాడు. అప్పటి సీఐ నరసింహారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితుడు వెంకటేశ్వర్లుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుందరయ్య యాదవ్ కేసు వాదించారు. నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మల్లిఖార్జున్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన సహమద్ ఆలీ తడ మండలం చేనిగుంటలో కోగిలి రామయ్యకు చెందిన ఖాళీ స్థలంలో పంక్చర్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గురువారం చేనిగుంట దళితవాడకు చెందిన మీజూరు ప్రతాప్ సైకిల్ తీసుకువచ్చి పంక్చర్ వేయాలని కోరాడు. సైకిళ్లకు పంక్చర్ వేయలేనని సహమద్ ఆలీ చెప్పినా వినకుండా గొడవకు దిగాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థల యజమాని రామయ్య సర్దిచెప్పడానికి యత్నించాడు. ఆగ్రహించిన ప్రతాప్ రాయితో సహమద్ ఆలీ, రామయ్యపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు క్షతగాత్రులను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహమద్ఆలీ(47) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీ కులశేఖర్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం విల్లిపురానికి చెందిన ముట్టియన్ ఆండీ 2019లో నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి విచారణకు హాజరవుతున్నాడు. ఇదే కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు మార్చడంతో విచారణ మొదలైంది. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రభుత్వం తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, కోర్టు లైజన్ అధికారి, కోర్టు కానిస్టేబుల్ కలిసి సాక్ష్యాధారాలను పటిష్ఠంగా హాజరు పరచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు.

సంగనపల్లిలో నవోదయ విద్యాలయం

ఆర్డీవో స్థల పరిశీలన



సంగనపల్లిలో నవోదయ విద్యాలయం కోసం కేటాయించిన స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి

డక్కిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని సంగనపల్లి గ్రామంలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సంగనపల్లి వద్ద సర్వే నంబరు 148-1లో ఉన్న 24 ఎకరాల ప్రభుత్వ భూమిని నవోదయ పాఠశాలకు కేటాయించారు. ఈ ప్రాంతానికి రోడ్డు రవాణ, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని భూ కేటాయింపు జరిపారు. త్వరలోనే నవోదయ విద్యాలయ భవన నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ పెంచలయ్య, వీఆర్వో నరేష్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, అధికారులు

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు అర్జీలు అందజేశారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరించగా, కొన్ని అర్జీలను అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రమీల, సర్పంచ్ వెంకటరమణమ్మ, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కోటేశ్వరప్రసాద్, మధుయాదవ్, సుహాసిని, పోలమ్మ, మస్తాన్ బాషా, షంషుద్దీన్, చిల్లకూరు దశరథరామిరెడ్డి, చాపల శ్రీనివాసులు, నాగూరయ్య, ఏవో సుచేంద్రప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి

చిల్లకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వరగలి జడ్పీ ఉన్నత పాఠశాలలో తీరప్రాంత గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్స్యకార సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వర్షాల సమయంలో తీరప్రాంతాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. బోట్లు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సముద్రంలోకి కొత్తపడవలు ప్రవేశించినా, తీరప్రాంతాల్లో ఎవరైనా కొత్తవారు సంచరిస్తున్నా తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ శివసౌమ్య, ఎఫ్‌డీవో శ్రీనివాసులు, వీఆర్‌వోలు ఉదయ్‌కుమార్, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, సుమతి, రవికుమార్, మాధవి, కోటేశ్వరరావు, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల ఆరాధ్య దైవం పూలే



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన బహుజనుల ఆరాధ్య దైవమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల, మహిళల అభివృద్ధి కోసం పూలే ఎంతో కృషిచేశారని కొనియాడారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే కృషి కారణంగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, కందల కృష్ణారెడ్డి, అవధానం సుధీర్, సూరీ, సుబ్బారావు, రమణారెడ్డి, జువ్వలపాటి మస్తాన్, సాయి, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే ఆదర్శనీయుడని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక కారుస్టాండు సమీపంలోని పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించి, మహిళా విద్యకు కృషి చేసిన మార్గదర్శి జ్యోతిరావుపూలే అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, శివకుమార్, బీవీరమణయ్య, ఎల్‌వీ సుబ్బయ్య, వేమయ్య, వెంకటేశ్వర్లురాజు, శ్రీనివాసులు, రమేష్‌బాబు, భాస్కర్, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో నారాయణరెడ్డి, ఏపీఎం పద్మ, వెలుగు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రవికుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రేణిగుంట - కడప రహదారిలోని అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తిరుపతి అటవీశాఖ అధికారులు 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. డ్రైవర్ పారిపోయాడు. ఈ తనిఖీల్లో డీర్వో ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, కరకంబాడీ బీట్ ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, ప్రసాద్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు

గూడూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలంలోని గిరిశాస్త్రులవారి కండ్రిగ్ర గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ గొల్లపల్లి గ్రామంలోని మల్లికార్జున్ ఇంటితో పాటు పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. మనోజ్‌కుమార్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గూడూరు కోర్టులో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

గూడూరును జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమం

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని గూడూరు ప్రజా సమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డివిజన్ పోస్టాఫీసు వద్ద పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. ముఖ్య మంత్రి చిరునామాకు పోస్టుకార్డులను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరును తిరుపతిలో విలీనం చేయడంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ గూడూరు పర్యటనకు వచ్చిన సమయంలో నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో తీసుకున్న నిర్ణయంతో గూడూరు నియోజకవర్గ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గూడూరును జిల్లాగా ప్రకటించాలని, లేని పక్షంలో ఇచ్చిన హామీ మేరకు నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి గూడూరు ప్రజల మనోభావాలను తెలియజేసేందుకు చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, ఆనిమెళ్ల శివప్రసాద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న గూడూరు ప్రజాసమితి సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: విజయశ్రీ



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, అధికారులు

నాయుడుపేట టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి మండలాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సేవలు చేరవేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాన్నామని అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి రాష్ట్రంలో రైతాంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్, ఏవో గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కందలకృష్ణారెడ్డి, రఫీ, కట్టారమణారెడ్డి, నిత్యకృష్ణారెడ్డి, చెంగయ్య, చక్రపాణి, చెంచయ్య, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నిర్మిస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం తడకు చెందిన మాజీ ఎంపీటీసీ షోడవరం యల్లయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే విజయశ్రీ పరామర్శించారు. అనంతరం పూడి గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 40 యేళ్లుగా రోడ్డులేని పరిస్థితిని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు సెల్వం, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, డ్వాక్రా సంఘాల లీడర్లు, సభ్యులు

పెళ్లకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో ప్రమీలారాణి అన్నారు. పెళ్లకూరు స్త్రీశక్తి భవన్‌లో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై డ్వాక్రా సంఘాల లీడర్లు, సభ్యులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సమ్మన శ్రీహరి, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి

పెళ్లకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక, చెంబేడు గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును బాగు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి పునబాక, చెంబేడు గ్రామాలకు చెందిన జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాయుడుపేటలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలు, క్వారీలకు రాకపోకలు సాగించే వాహనాల కారణంగా రోడ్డు ధ్వంసమైందని, మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మల్లాం విజయ్, నాయకులు తాళ్ల రెడ్డిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సాకీయా పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశామని కరస్పాండెంట్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కల్యాణి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



దేవసేనకు నగదును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీలో ఇద్దరికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచన మేరకు టీడీపీ నాయకులు ఆర్థిక సాయం చేశారు. గూడలి అరుంధతీయవాడకు చెందిన తాళ్లూరు దేవసేన ఇల్లు కాలిపోవడంతో ఆయనకు రూ.5వేలు, ప్రకాశంకాలనీకి చెందిన మహేష్ గుండె శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయనకు రూ.5వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, బందిలి రఘురామయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం ఆరిమేనిపాడులో కుందాం సొసైటీ అధ్యక్షుడు పురుషోత్తంరాజు అధ్వర్యంలో శుక్రవారం జరిగిన రైతన్నా - మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆరిమేనిపాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిమ్మ సాగు, ఎదురౌతున్న సమస్యలు, ధరల గురించి రైతులు విజయశ్రీకి వివరించారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ గోపీనాయక్, ఏవో వరప్రసాద్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఓజిలి మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, బీసీ, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కే ఖలీల్, ఏఎంసీ డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరును జిల్లా కేంద్రం చేయాలి



రెవెన్యూ ఉద్యోగుల తరపున ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, అలా కానిపక్షంలో నెల్లూరులో కలపాలని కోరుతూ ప్రభుత్వ, ప్రైవేట్, ఉద్యోగులు, అసోషియేషన్లు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. మొదట కోట మండల రెవెన్యూ ఉద్యోగుల తరపున తహసీల్దారు జయజయరావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూటీఎఫ్, బీటీఏ, ఐసీడీఎస్, అంగన్‌వాడీ వర్కర్స్, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు, వెలుగు, ఇరిగేషన్, ట్రాన్స్‌కో ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. ఆయా వినతులను ముఖ్యమంత్రికి పంపుతానని ఎమ్మెల్యే తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిత

నాయుడుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని శాసనసభలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించింది. ఇందులో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ వేషధారణలో నాయుడుపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని కావలి పల్లవి మాట్లాడారు. అసెంబ్లీలో చక్కగా, క్రమశిక్షణతో మాట్లాడిన పల్లవికి ఎమ్మెల్యే విజయశ్రీ ఎమ్మెల్యే ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధులే లక్ష్యం

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మెరుగైన జీవనోపాధులతో పాటు పారిశుధ్యం, పచ్చదనం వికసించేలా థీమ్-5 కింద క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా కార్యదర్శులు, వెలుగు, అంగన్వాడీ, ఆశా వర్కర్లతో పాటు పలువురు సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో జ్యోతికిరణ్, పక్కన ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీవో జ్యోతికిరణ్ అన్నారు. సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మన్నారు పోలూరు ప్రాథమిక పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య, ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడి మృతి



రాజా(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ వి.రాజా గుండెపోటుతో మృతి చెందారు. కళాశాలలో ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు.

ఆలయ భూములను కాపాడండి

తిరుపతి(జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని వేదనారాయణ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ కుమార్, హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ టీటీడీకి చెందిన ఆలయ భూములను స్థానిక వీఆర్వో నాగభూషణం తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. గుడిమాన్యాన్ని ఆక్రమించుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకుడు షఫీహరన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవ్వాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి విస్మరించడం సబబు కాదన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, ఎల్‌వీ సుబ్బయ్య, వెంకటేశ్వర్లురాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సముద్రతీరంలో పునిత్ సాగర్ అభియాన్



సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెడుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలం శ్రీనివాసస్రతం సముద్రతీరంలో శుక్రవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో పునిత్ సాగర్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఎన్‌సీసీ క్యాడెట్లు చీపురులు చేతబట్టి సముద్రతీరాన్ని శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెట్టారు. మత్స్యకారులకు, గ్రామస్తులకు నీటి వనరుల సంరక్షణ, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నావెల్ యూనిట్ కామాండెంట్ గణేష్ గోడంగావే, సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరును పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

వెంకటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిధిలోని ఆల్తూరుపాడు రిజర్వాయరును తక్షణమే పూర్తిచేసి రైతులకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పూర్తయితే డక్కిలి, వెంకటగిరి, ఏర్పేడు మండలాలతో పాటు తిరుపతి పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజశేఖర్, వెంకటరమణ, పెంచలయ్య, రాధాకృష్ణ, బాలకృష్ణ, జాన్, నరసింహులు, శివకుమార్, మునిక్రిష్ణారెడ్డి, మునీంద్ర, సాయి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్

వాకాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ అన్నారు. శుక్రవారం వాకాడు ఎస్టీ బంగ్లాకాలనీ వద్ద సివిల్ రైట్స్ డే నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. బంగ్లాకాలనీవాసులు మాట్లాడుతూ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఎంఈవో నసీంఆలీ పాల్గొన్నారు.

పెళ్లకూరులో...



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత

పెళ్లకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిప్రియ అన్నారు. శుక్రవారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా మంచి శారీర దారుఢ్యంతో ఎదుగుతారని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఎం.సుజిని, పి.గౌరీప్రియ, ఎం.పుష్పకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

టీపీ కోట రోడ్డుకు మోక్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నాగలాపురం నుంచి టీపీ కోట మీదుగా చిన్న పాండూరు వరకు సింగిల్ రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. శుక్రవారం నాగలాపురంలోని మార్కెట్‌యార్డు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సత్యవేడు మండలం రాజులకండ్రిగ నుంచి టీపీ కోట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. వీటితో పాటు నాగలాపురం మండలానికి 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని కృష్ణాపురం, నందనం, బీరకుప్పం, వెంబాకం గ్రామాల్లో పీహెచ్‌సీల ఏర్పాటుకు రూ.1.44 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటికి టెండర్లు ప్రక్రియ కూడా పూర్తయిందని స్పష్టం చేశారు. మురళి, అన్బు, ఎస్.ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఏర్పేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్ తన సొంతూరు ఊరందూరులోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, శ్రీకాళహస్తి మార్కెట్ యార్డు చైర్మన్ చెంచయ్యనాయుడు, నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రైతుబజార్లు ఏర్పాటు చేయండి

- వ్యవసాయ మంత్రికి వినతి



పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరి, పుత్తూరు మున్సిపాలిటీల పరిధిలో రైతు బజార్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం ఆయన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు బజార్ల ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, వ్యవసాయశాఖ అధికారులకు అప్పటికప్పుడే ఆదేశించారని విజయ్‌బాబు తెలిపారు.

పామాయిల్ తోటలకు ప్రోత్సాహం



అప్పలాయగుంటలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

వడమాలపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వంద శాతం రాయితీతో పామాయిల్ మొక్కలను అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తోందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి చెప్పారు. రైతన్నా మీకోసంలో భాగంగా శుక్రవారం అప్పలాయగుంటలో ఉద్యాన వన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ... పామాయిల్ గెలలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అంతర పంటలు పండించే రైతులకు హెక్టార్‌కు సం వత్సరానికి రూ.10,500 ప్రభుత్వం అందిస్తుందన్నారు. శ్రీకాళహస్తి హార్టీకల్చర్ నర్సరీలో పలురకాల మామిడి మొక్కలు ఉన్నాయని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని చెప్పారు. పుత్తూరు ఉద్యానవన శాఖ అధికారి సౌజన్య పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల నుంచి అధిక రుసుం వసూలు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారుల నుంచి అధిక మొత్తంలో రుసుం వసూలు చేస్తున్నారని కమిషనర్ నాగేశ్వరరావుకు ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఫిర్యాదు చేసింది. గెజిట్ ప్రకారం కాకుండా అనధికారకంగా అధిక మొత్తంలో కాంట్రాక్టర్ వసూళ్లకు పాల్పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. బయట ప్రాంతాల నుంచి వాహనాల్లో కూరగాయలు, పండ్లు వంటివి హోల్‌సేల్‌గా విక్రయిస్తూ తమ పొట్ట కొడుతున్నారని వాపోయారు. గోపి, చంద్రబాబు, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళులు

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కృష్ణ సముద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త యేసువరం భౌతికకాయానికి శుక్రవారం పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, త్యాగరాజు, అనంతరాజు, పాల్‌రాజ్, జయకుమార్ తదితరులు ఉన్నారు.

పచ్చదనం అత్యంత ఆవశ్యకం

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆరేటమ్మ ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆలయ ఈవో జయకృష్ణ, సదాశివేశ్వర ఆలయ చైర్మన్ దిలీప్ కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికి రెండుసార్లు రక్తదానం

పుత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యువకులు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి కోరారు. కేకేసీ కళాశాలలో శుక్రవారం జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ... రక్తదానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. 50మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డాక్టర్ ఆర్ముగం, కె.కుప్పయ్యశెట్టి, కె, నరసింహారావు, గుణశేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్థానికేతరుడికి పట్టా ఇవ్వొద్దంటూ గిరిజనుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

పుత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ అనుభవంలోని మామిడితోటను తప్పుడు రికార్డులతో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోపాలకృష్ణాపురం గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారికి సీపీఎం నాయకులు మద్దతుగా నిలిచారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ... గోపాలకృష్ణాపురం గిరిజన కాలనీకి చెందిన ముగ్గురు రైతులు 50 ఏళ్లుగా తొర్రూరు సర్వే నెం.35-2లో రెండున్నర ఎకరాల్లో మామిడితోటను సాగు చేసుకుంటూ వస్తున్నారు. గవర్నర్ దత్తత తీసుకున్న ఆ కాలనీ పరిధిలోని ఈ పొలంపై స్థానికేతరుడు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులతో కుమ్మక్కై పట్టా తీసుకుని కోర్టుకు వెళ్లారని తెలిపారు. క్షేత్రసాయిలో మామిడి చెట్లు పెట్టి ఫలసాయం పొందుతున్న గిరిజనులకు పట్టాలివ్వకుండా అనుభవేతరుడికి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందించారు.

ఏఐటీయూసీ సభను జయప్రదం చేయండి

వరదయ్యపాళెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 30న ఆదివారం జరిగే ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ సభను జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. చంద్ర, సుబ్బు, కడూరు చంద్రయ్య, యూసుబ్, రమణయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమస్యలను సత్వరం పరిష్కరిస్తానని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులను పరిష్కరించాలని కోరారు. గ్రీవెన్స్‌కు సంబంధించి ఒక ఫారం రూపొందించామని దాన్ని అర్జీదారులు నింపి అధికారులకు అందిస్తే 15రోజుల్లో అధికారులు ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, నాయకులు గోపీనాథ్, నాగరాజునాయుడు, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా



రేణిగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగుంట కూడలిలో బ్యారెళ్లు తరలిస్తున్న లారీ బోల్తా పడడంతో కొద్ది సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు... విశాఖపట్నం నుంచి బెంగళూరుకు బ్యారెళ్లతో వెళ్తున్న లారీ మర్రిగుంట కూడలి వద్ద నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముందు జాగ్రత్తగా వాహనాలను నిలిపివేసి లారీని పక్కకు తొలగించారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రప్రసాద్, స్వరూపారాణి దంపతులు రూ.లక్షను, చెన్నైకుచెందిన డాక్టర్ రాజ్‌కుమార్, రాజి దంపతులు రూ.75,700. గోసంరక్షణకు రూ.10వేలు విరాళంగా అందజేశారు. చెక్కులను స్వీకరించిన ఆలయ అధికారులు దాతలకు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27వ వార్డు వాటర్‌హౌస్ కాలనీలో గ్రీన్‌ప్లై పరిశ్రమ సహకారంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి ప్రారంభించారు. గ్రీన్‌ప్లై పరిశ్రమ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, అనిత, కిట్టు, యశ్వంత్, అధికారులు, గ్రీన్‌ప్లై సంస్థ ఉద్యోగులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పద్మావతమ్మ ఊంజలసేవ

నారాయణవనం, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించండి

రేణిగుంట నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును స్విమ్స్‌లో పనిచేస్తున్న మొబైల్ క్యాన్సర్, స్క్రీనింగ్, పింక్ బస్సు సిబ్బంది కోరారు. శుక్రవారం విమానాశ్రయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సిమ్స్ ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రకారం 22 మంది సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో కొనసాగించాలే చూడాలని కోరారు. న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ వారికి చెప్పారు.

విద్యార్థులకు పోటీలు



వక్తృత్వ పోటీల్లో ప్రసంగిస్తున్న విద్యార్థిని

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వ, పోస్టర్ల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎయిడ్స్ నివారణపై ఈ సందర్భంగా అధ్యాపకులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు, అధ్యాపకులు గంగారాం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ సమస్యను పరిష్కరించండి



శంకర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పూడివాసులు

కేవీబీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల పరిధిలో క్రషర్ సమస్యను పరిష్కరించాలని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డికు మండలంలోని పూడి గ్రామాలవాసులు శుక్రవారం ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. సర్వే నెం.425, 279లో క్రషర్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని శంకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, బాలకృష్ణంరాజు, రాములు, మనోహర్, శాస్త్రిరాజు, నాగేష్, బాలాజీ, గిరిబాబు, చంద్రశేఖర్, పరశురామ్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్‌తో పాల్గొని ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేబీజీ ప్యాలెస్‌లో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌లో సుమారు 200 అర్జీలు అందాయి. టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నందకిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భారతమ్మ, వార్డు మెంబర్ మునిభూషణమ్మ, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సుధీర్ పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు ఘన నివాళులు

- బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా



పూలేకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూసలవీధి కూడలిలో శుక్రవారం టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు.ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఉమేష్‌రావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు భాస్కర్ ముదిరాజ్, డీవీ నారాయణ, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, గాజుల భగత్, సయ్యద్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావపూలే ఆశయాలను కొనసాగిద్దామని ఏపీ బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలాజీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని టీఎంవీ కండ్రిగలో శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. పూలే పోరాటాల ఫలితంగానే నేడు బలహీన వర్గాలకు సామాజిక హక్కులు లభించాయన్నారు. మునిరామిరెడ్డి, గోవర్ధన్, మోహన్, బలరామిరెడ్డి, దిబ్బారెడ్డి పాల్గొన్నారు.

జయమ్మ అంత్యక్రియలు



శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో శుక్రవారం జయమ్మకు కన్నీటి నడుమ అంత్యక్రియలను పూర్తి చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తల్లి జయమ్మ గురువారం హత్యకు గురైన విషయం తెలిసిందే. శుక్రవారం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి భౌతికకాయాన్ని కుటుంబీకులకు అప్పగించారు. శుక్రవారం మధ్యాహ్నం జయమ్మ అంత్యక్రియలు జరిగాయి. ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరై జయమ్మకు నివాళులర్పించారు. అనంతరం పాడెను మోశారు. వైసీపీ నాయకులు అంజూరు శ్రీనివాసులు, బర్రె హేమభూషన్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సదాశివం

ఏర్పేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని నాయీబ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని ఆముదూరు, దుర్గిపేరి, పల్లంపేట బూత్‌ల నాయకులతో సమావేశమై పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజునాయుడు, గాలి కృష్ణవేణి, రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవ మనుగడ

ఏర్పేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని వికృతమాల సమీపంలోని డిక్సన్ పరిశ్రమ యాజమాన్యం, సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యం పరిశ్రమ ఆవరణలో మొక్కలను నాటారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు మాట్లాడుతూ పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలను నాటి సంరక్షించాలన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

కేవీబీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపీడీవో మాలతి అన్నారు. శుక్రవారం పచ్చదనం, పరిరక్షణపై మహిళా సంఘాలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వీవోలు, ఇద్దరు సభ్యులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పర్యావర పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి ముందు మొక్క నాటి సంరంక్షించే విధంగా చూడాలన్నారు. అనంతరం మహాత్మా పూలే వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు.

బ్యాంకుల వద్ద జాగ్రత్త

పిచ్చాటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్యాంకుల్లో కొందరు లావాదేవీల కోసం వచ్చినట్లు గంటల తరబడి వేచి చూసి డబ్బు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈనెల 27న గురువారం ఇలాంటి సంఘటన వెలుగు చూసింది. పిచ్చాటూరులోని ఓ బ్యాంకులో కీళపూడికి చెందిన మహిళ రూ.2.79 లక్షలు డ్రా చేసి ఆటోలో ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై ఆటోను వెంబడించాడు. ఈ క్రమంలో ఆటో దిగి నడిచి వెళుతున్న ఆమె బ్యాగ్ లాక్కోవాలని చూశాడు. అప్రమత్తమైన ఆమె బ్యాగ్‌ని గట్టిగాపట్టుకుని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వీధుల్లోకి రావడంతో ఆగంతకుడు అక్కడి నుంచి బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆన్‌కాల్ డ్రైవర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజరు రేవతి తెలిపారు. 18 నెలలు పూర్తైన హెవీ లైసెన్సు, ఆధార్‌కార్డు, దరఖాస్తును శ్రీకాళహస్తి డిపో మేనేజరు కార్యాలయంలో డిసెంబరు 1 నుంచి ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సమర్పించాలన్నారు. వివరాలకు నెం.9959297947, 9063774464లలో సంప్రదించాలన్నారు.

యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న మునిరాజానాయుడు, భాస్కర్ తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పీఏసీఎస్ వద్ద శుక్రవారం సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు ఆధ్వర్యంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఈవో చిరంజీవిరెడ్డి, బత్తుల విజయకుమార్‌నాయుడు, కె.రామచంద్రయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వం



కరపత్రాల పంపిణీలో గురవారెడ్డి తదితరులు

ఏర్పేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అన్నారు. మండలంలోని పాత వీరాపురంలో శుక్రవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. పంచ సూత్రాలను వివరించారు. ఈకార్య క్రమంలో మహేష్‌రెడ్డి, గాలి కృష్ణవేణి, మునిరంగారెడ్డి, దొరస్వామి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు స్టేతో మళ్లీ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద రెడ్డి

రేణిగుంట నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద్ రెడ్డి కోర్టు స్టేతో మళ్లీ విధుల్లో చేరారు. రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇటీవల ఆయన్ను సస్పెన్షన్ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆనందరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలో కోర్టు ఉత్తర్వులతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఆనందరెడ్డి విధుల్లోకి హాజరయ్యేందుకు అనుమతులు జారీ చేశారు. ఈమేరకు చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ ముని శంకరయ్య ఉత్తర్వులు జారీ చేయడంతో, శుక్రవారం ఆనంద రెడ్డి మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.